క్లుప్తంగా

గిరిజనులపై దాడులు అరికట్టాలి



ధర్నా చేస్తున్న గిరిజనులు

భాకరాపేట: గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హరినాథ్ డిమాండ్ చేశారు. చిన్నగొట్టిగల్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. మండలంలోని చిట్టేచెర్ల పంచాయతీ తుమ్మచేనుపల్లెలో గిరిజనుల ఇంటి స్థలాలను ఆక్రమించి మహిళపై దాడి చేసిన పెత్తందార్లపై కేసు నమోదు చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వాసుదేవ్‌కు వినతి పత్రం ఇచ్చారు.

మల్లేశ్వరుడికి సింధూరం అలంకరణ

చంద్రగిరి: చంద్రగిరి ఆర్‌ఎఫ్ రోడ్డు లోని శ్యామలాంబ సమేత మల్లేశ్వర స్వామికి శుక్రవారం సింధూర అలంకరణ చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు.

సుప్రియకు డాక్టరేట్



తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీ కార్డియాలజీ విభాగం పరిశోధక విద్యార్థిని డాక్టర్ ఏ సుప్రియకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమె ప్రొఫెసర్ వి.వనజాక్షమ్మ పర్యవేక్షణలో ×ఇంపాక్ట్ ఆఫ్ యోగా ఆన్ పీస్ ఫుల్‌నెస్ ఆఫ్ ప్రెగ్నెంట్ ఉమెన్ కార్డియో వాస్క్యులర్ హెమోడైనమిక్స్, స్ట్రెస్ లెవెల్స్ మెటర్నల్, ఫీటల్-నియోనెటల్ ఔట్ కమ్స్ అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

పోరాటాలే లక్ష్యం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి కల్చరల్: ప్రజావ్యతిరేక విధానాలతో దగా చేస్తున్న మోదీ, కూటమి ప్రభుత్వ ధోరణిపై రాజీలేని పోరాటాలే లక్ష్యంగా డిసెంబర్ 1, 2 తేదీల్లో సత్యవేడులో సీపీఎం జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నాలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. సీపీఎం నేతలు కందారపు మురళి, జయచంద్ర, సాయిలక్ష్మి, టి.సుబ్రమణ్యం, వేణుగోపాల్, కేఆర్‌ఎస్ మణ్యం పాల్గొన్నారు.

స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ పరిశీలన



మాట్లాడుతున్న తిరుపతి డీఈఓ కుమార్

రామచంద్రాపురం: మండలంలోని వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు జరుగుతున్న స్కూల్ లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమాన్ని తిరుపతి డీఈఓ కేవీఎస్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన స్కూల్ హెడ్స్‌కు ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. డిసెంబర్ 7న మెగా పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని కోరారు.ఏఎంఓ శివశంకరయ్య, ఎఎస్ఓ సారథి, కైవల్య ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధి శంకర్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో కీర్తి సురేష్



తిరుమల: డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, సినీ నటి కీర్తి సురేష్ దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

బాలిక ఘటనను ప్రచారం చేయకూడదని చెవిరెడ్డికి తెలియదా?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి అర్బన్: న్యాయశాస్త్రం చదివిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ఓ మైనర్ బాలికకు జరిగిన ఘటనను ప్రచారం చేయకూడదని తెలియదా? అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎర్రావారిపాళెం మండలంలో జరిగిన ఘటనలో పోక్సో యాక్ట్ ప్రకారం తలిదండ్రుల వివరాలు సోషల్ మీడియాలో ప్రచారం చేయకూడదని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డికి తెలియదా అనిఅన్నారు. 2012లో వచ్చిన పోక్సో చట్టంలోని ఆంతర్యాలు తెలిసి కూడా ఆ విధంగా ఎలా వ్యవహరించారని ప్రశ్నించారు. చిన్నారి తండ్రి ఫిర్యాదుకు ముందే ఈనెల 5న పోలీసులు పోక్సో యాక్ట్ కేసు నమోదు చేశారని తెలిపారు.

ఆ మూడు స్థలాలు ఖాళీగా ఎందుకు..?

- వినియోగంపై దృష్టి సారించని అధికారులు
- మరోవైపు అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్
- తిరుపతి బస్టాండ్‌కొస్తే అగచాట్లే



పల్లెవెలుగు బస్టాండ్ సమీపంలో ఖాళీగా ఆర్టీసీ స్థలం



విద్యార్థులు బస్సుపాస్‌లు తీసుకునే చోట వాహనాల పార్కింగ్

తిరుపతి అర్బన్: ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉన్న దృష్ట్యా తిరుపతి బస్టాండ్ నిత్యం 1.20 లక్షల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇందులో 10–20 శాతం మంది ప్రయాణికులను బస్సు ఎక్కించడానికి వారి కుటుంబ సభ్యులో, ఆత్మీయులో వచ్చి సాగనంపుతూంటారు. అయితే కొన్ని నిమిషాల పాటు బస్టాండ్ ఆవరణలో తమ ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేయడానికి వీలు లేకుండా పోతోందని ఇక్కడ ఉన్న పరిస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి విశాలమైన పలు స్థలాలను ఖాళీగానే ఉంచి, ఆ స్థలాల్లోకి వెళ్లకుండా కంచెను ఏర్పాటు చేశారు. మిగిలిన ప్రాంతాల్లో నో పార్కింగ్ బోర్డును పెట్టేశారు. దీంతో వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక ప్రయాణికులు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఓ వైపు ఆర్టీసీ సర్వీసుల రాకపోకలకు, మరోవైపు ప్రయాణికుల రాకపోకలు ఇబ్బందిగా మారుతోంది.



డీఎం కార్యాలయం ముందుభాగంలో వాహనాలు పెట్టడంతో పరిస్థితి ఇలా..

ఆ స్థలాలు ఖాళీగా ఉంచడం ఎందుకో..?

పల్లెవెలుగు బస్టాండ్ పక్కనే 250 వరకు ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయడానికి వీలుగా ఓ పెద్ద ఖాళీ స్థలం ఉంది. అయితే అందులోకి వెళ్లకుండా కంచె పెట్టేశారు. తిరుపతి డీఎం కార్యాలయం ముందుగా భాగంగా 300 ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయడానికి వీలుగా ఖాళీ స్థలం ఉంది. అయితే అక్కడా కంచె పెట్టేశారు. బస్టాండ్ ప్రధాన ద్వారం(దక్షిణం వైపు) పెద్ద ఖాళీ స్థలం ఉంది. 200 వాహనాలను పార్కింగ్ చేయడానికి వీలుంది. అక్కడ కూడా సేమ్ టు సేమ్ కంచె దర్శనమిస్తోంది. ఇలా ఈ మూడు స్థలాలు ఖాళీగానే ఉన్నాయి! ఫలితంగా బస్టాండ్‌కు వచ్చిపోతున్న ప్రయాణికులు ఎక్కడపడితే అక్కడ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ఎటు చూసినా వాహనాల పార్కింగ్ దర్శనమిస్తోంది. ఏడుకొండల బస్టాండ్ సమీపంలో విద్యార్థులకు బస్సు పాస్‌లు ఇచ్చేచోట, ప్రధాన ద్వారం వైపు ఏటీఎంలు ఉన్న చోట, కార్గో పాయింట్, గ్యారేజి ముందు భాగంలో, శ్రీనివాస బస్టాండ్ తూర్పువైపు ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఎక్కడ కాస్తా ఖాళీ స్థలం ఉంటే అక్కడ బైక్స్ పెట్టేస్తున్నారు. దీంతో ఇక్కట్లు తప్పడం లేదు. ఖాళీగా ఉన్న ఆ మూడు స్థలాలు పార్కింగ్‌కు అవకాశం కల్పిస్తే ఈ ఇబ్బందులకు ఫుల్‌స్టాప్ పెట్టవచ్చు. ఆ దిశగా ఆర్టీసీ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పార్కింగ్ ఇబ్బందులు లేకుండా చర్యలు

నో పార్కింగ్ వద్ద వాహనాలు పెట్టకుండా చూస్తాం. ఖాళీ స్థలాల్లో పార్కింగ్ వీలుంటే ఆ దిశగా చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తెలియజేస్తాం. ప్రయాణికులకు, ఆర్టీసీ సర్వీసులను ఇబ్బందులు లేకుండా చేస్తాం.

–డీఆర్ నాయుడు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, తిరుపతి ఆర్టీసీ డిపో



శ్రీవారి దర్శనానికి 13 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 56,952 మంది స్వామివారిని దర్శించుకోగా 21,714 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.84 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 13 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఉమెన్స్ అథ్లెటిక్స్ ఛాంప్ ఎస్పీడబ్ల్యూ



ఎస్పీడబ్ల్యూ కళాశాల విద్యార్థినులకు ట్రోఫీ అందజేస్తున్న అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో రెండు రోజులు నిర్వహించిన ఇంటర్ కాలేజ్ గేట్ ఉమెన్ అథ్లెటిక్స్ విభాగంలో ఎస్పీడబ్ల్యూ కళాశాల, పురుషుల విభాగంలో ఎస్వీసీసీ కళాశాల చాంపియన్‌షిప్ దక్కించుకున్నాయి. సింగిల్ ఉమెన్ అథ్లెటిక్ విభాగంలో తిరుపతి సిద్ధార్థ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు చెందిన ఎం రక్షణ, పురుషుల సింగిల్ విభాగంలో ఎస్వీసీసీ కళాశాల విద్యార్థి పి. శ్రీధర్ విజేతలుగా నిలిచారు. చాంపియన్‌షిప్ కై వసం చేసుకున్న జట్లకు వర్సిటీ రిజిస్ట్రార్ భూపతినాయుడు, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్ రెడ్డి ట్రోఫీతో పాటు బహుమతులను అందజేశారు.

క్రమశిక్షణతో అభ్యసిస్తే ఉజ్వల భవిత

తిరుపతి తుడా: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తేనే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రేణు దీక్షిత్ అన్నారు. టీటీడీ ఎస్వీ ఆయుర్వేద కళాశాలలోని ధన్వంతరి ఆడిటోరియంలో శుక్రవారం కళాశాలలో కొత్తగా చేరిన ఆయుర్వేద విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ వారికి మార్గదర్శనం చేశారు. కొత్తగా కళాశాలలో అడుగు పెట్టిన జూనియర్ విద్యార్థుతో సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉంటూ ఆదర్శవంతంగా నిలవాలన్నారు. అప్పుడే వారికి కళాశాలపై మక్కువ పెరిగి చదువులోనూ రాణించగలరన్నారు. అలాగే జూనియర్ విద్యార్థులు సైతం సీనియర్ విద్యార్థులతో గౌరవ మర్యాదలతో నడుచుకుంటూ చదువులో వారి అనుభవాలను పంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సెట్విన్ సీఈవో మోహన్ కుమార్, సీఐ వాసుదేవ చౌదరి ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్ నిరోధంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు

ఆయన కవిత్వం.. ప్రకృతి సౌందర్యం

–సూక్ష్మ కవితలు పుస్తకావిష్కరణ సభలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: ప్రకృతి సౌందర్యాన్ని తెలుగు విశ్రాంతాచార్యులు ఎస్‌జీడీ చంద్రశేఖర్ కవిత్వంగా మలిచారని పలువురు వక్తలు ప్రస్తుతించారు. చంద్రశేఖర్ రాసిన సూక్ష్మ కవితలు–2 పుస్తకావిష్కరణ శుక్రవారం ఎస్వీయూ తెలుగు అధ్యయన విభాగం, ఈతరం కవితా వేదిక ఆధ్వర్యంలో తెలుగు అధ్యయన శాఖ విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. పేట శ్రీనివాసులురెడ్డి, తోట వెంకటేశ్వర్లు, మేడిపల్లి రవికుమార్, మునిరత్నమ్మ తదితరులు సూక్ష్మ కవితలపై విశ్లేషణ చేశారు. ఆచార్య ఎస్‌జీడీ చంద్రశేఖర్ వివిధ హోదాలలో నాలుగు దశాబ్దాలుగా తెలుగు అధ్యయన శాఖకు సేవ చేశారని కొనియాడారు. కవిగా ఆయన రాసిన పుస్తకాల గురించి చెప్పారు. మనుషులతో సున్నితంగా వ్యవహరించే ఆయన కవిత్వంలోనూ అత్యంత సున్నితంగా సృజించారని, తిలక్, శ్రీ శ్రీ ప్రభావంతో ఆయన గొప్ప కవిత్వాన్ని రాశారని, కవిత్వం రాయడంతో పాటు కొత్త తరం కవులను ప్రోత్సహిస్తూ ఉన్నారన్నారు. ప్రకృతి, ప్రణయ తత్త్వం గొప్ప కవిత్వంగా ఆయన కలం నుంచి జాలువారిందన్నారు. సాహిత్య సృజనలో విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకుని సాహితీ రంగంలో రాణించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాటూరి శారద, కె. మునిరత్నం, ఎలవర్తి చంద్రమౌళి, సాహితీవేత్తలు ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, ఎస్‌హెచ్ సౌభాగ్యమ్మ, ఆకుల మల్లేశ్వరరావు, సింగార బాలమురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మెరుగైన పారిశుధ్యం ముఖ్యం



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: కరకంబాడి రోడ్డు మార్గంలోని బయోట్రిమ్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేయాలని ఇంజినీరింగ్, హెల్త్ అధికారులను కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. ఉపాధ్యాయ నగర్ రోడ్డు, బయోట్రిమ్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, మురుగు కాలువల నిర్మాణంపై ఇంజినీరింగ్, హెల్త్, ప్లానింగ్ అధికారులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. బయోట్రిమ్, ఉపాధ్యాయ నగర్ రోడ్డు మధ్య ఉన్న మురుగు కాలువ సరిగా లేకపోవడంతో అపరిశుభ్రత ఎక్కువగా ఉందని, వీధికుక్కలు లోనికి వస్తున్నాయని, జింకలు, దుప్పులు రోడ్లపై వస్తున్నాయని బయోట్రిమ్ అధికారులు, ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు మానస సరోవర్ నుంచి వినాయక సాగర్ వరకు మురుగు కాలువ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే గోవిందధామం ఎదురుగా దుకాణాలు ఉండడంతో జింకలు, చిరుత పులులు వస్తున్నాయని ఫిర్యాదులు వచ్చాయన్నారు. దుకాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ మహాపాత్ర, డీఈలు, ఏసీపీలు పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న గాజుల నాగేశ్వరరావు

తిరుపతి కల్చరల్: వేతన సవరణ కమిటీ నియామకంతోపాటు అమలు ఆలస్య మవుతున్న నేపథ్యంలో 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక బైరాగిపట్టెడలో శుక్రవారం ఎస్టీయూ అసోసియేషన్ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తి అయినా ఇంత వరకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు పిలువకపోవడం విడ్డూరమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్థికపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. 12వ పీఆర్‌సీ ఆలస్యం కాకుండా కమిషన్‌ను నియమించి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జగన్నాథం, నేతలు వాసు, సుధాకర్ యాదవ్, వెంకటరమణ, సురేష్, చెంచు రత్నయ్య పాల్గొన్నారు.

రుద్రయాగం.. పరిసమాప్తం





శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చక పండితులు, కల్యాణోత్సవంలో భక్తులు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో 11 రోజులుగా నిర్వహిస్తున్న రుద్రయాగం శుక్రవారం శాస్త్రోక్తంగా పరిసమాప్తమైంది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నెల పాటు హోమ మహోత్సవాలు నిర్వహించారు. ముగింపు రోజున ఉదయం రుద్రయాగం, మహా పూర్ణాహుతి, మహాశాంతి అభిషేకం, కలశ ఉద్వాసన నిర్వహించారు. అనంతరం శ్రీకపిలేశ్వరస్వామి మూలమూర్తులకు కలశాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ గౌతమి, ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం

శుక్రవారం సాయంత్రం శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం భక్తజన సందడి నడుమ కనుల పండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించి, పట్టు పీతాంబరాలతో అలంకరించి కల్యాణ వేదికపైకి వేంచేపు చేశారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక అభిషేకం

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని నడకమార్గం చెంత వెలసి ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసంలో స్వాతి తిరు నక్షత్రం సందర్భంగా ఏటా స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. మూలమూర్తికి ఉదయం పంచామృతం, పసుపుతో విశేషంగా అభిషేకించారు. కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈవో సీహెచ్.వెంకయ్య చౌదరి భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు. అనంతరం అడిషనల్ ఈవోను శ్రీవారి ఆలయ పోటు పేష్కార్ మునిరత్నం సన్మానించారు. టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

18 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న 18 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరిండెంట్ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు నగరంలో పలుచోట్ల ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ట్రాఫిక్ కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

యాప్‌తో వ్యాపార సంస్థల వివరాలు

తిరుపతి అర్బన్: మొబైల్ యాప్ ద్వారా పరిశ్రమల పరిధిలోని వ్యాపార సంస్థల వివరాలను నమోదు చేయాలని గ్రామ, వార్డు సచివాలయ అధికారి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ప్రసాద్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్‌తో కలిసి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పలు పరిశ్రమలతోపాటు వ్యాపార అసోసియేషన్లను భాగస్వాములను చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు జిల్లాకు సంబంధించి పూర్తి సమాచారాన్ని యాప్‌లో నమోదు చేయాలన్నారు.

కక్ష సాధింపులు.. రోడ్డుకడ్డంగా మట్టి కుప్పలు

- తిమ్మినాయుడుపాళెం దళితవాడలో టీడీపీ నాయకుడి దౌర్జన్యం



తిమ్మినాయుడుపాళెం దళితవాడ వద్ద రోడ్డుకు అడ్డంగా మట్టి గుట్టలు పోసిన టీడీపీ నాయకుడు

తిరుపతి మంగళం: నివాస ప్రాంతాల్లో శవాలు పూడ్చడం ఏమిటని ప్రశ్నించినందుకు తిమ్మినాయుడుపాళెం దళితవాడలోని టీడీపీ నాయకుడు కాయం వెంకటరత్నం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తిరుపతి శివారు ప్రాంతంలోని తిమ్మినాయుడు పాళెం దళితవాడ వాసులు తాతల కాలం నాటి నుంచి 199 సర్వే నంబర్‌లో 1.45 ఎకరాల వరకు గ్రామం ఎదురుగా శ్మశాన స్థలంలో కర్మక్రియలు జరుపుకునే వారు. అయితే ఆ శ్మశాన స్థలాన్ని టీడీపీ నాయకుడు వెంకటరత్నంతో పాటు గ్రామంలోని మరికొందరు ఆక్రమించుకుని రేకుల షెడ్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో ఎవరైనా చనిపోతే పూడ్చడానికి శ్మశానం లేదు. గ్రామం వెనుక భాగంలోని అటవీ ప్రాంతంలో శవాలను పూడ్చుతున్నారు. అయితే అటవీ ప్రాంతం పక్కనే లేవుట్ ఉండడం, అందులో ఇళ్ల పక్కన శవాలు పూడ్చడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దాంతో టీడీపీ నాయకుడు వారిపై కక్ష సాధింపుతో గ్రామం నుంచి లేవుట్‌కు వెళ్లే రోడ్డు మార్గాన్ని జేసీబీతో తవ్వేశాడు. రోడ్డుకడ్డంగా గుట్టలుగా మట్టిపోయించి దారి లేకుండా చేశాడు. దీనిపై కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. లేనిపక్షంలో కార్పొరేషన్ వద్ద ధర్నా చేపడుతామని పలువురు హెచ్చరిస్తున్నారు.

అమ్మవారికి కళార్చన



వేదపారాయణం చేస్తున్న ఎస్వీ వేద అధ్యయన సంస్థ పండితులు



అన్నమాచార్య కళామందిరంలో సంకీర్తనలు ఆలపిస్తున్న కుమారి హారతి

తిరుపతి కల్చరల్: శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం వివిధ కళా వేదికలపై కళాకారుల ఆధ్యాత్మిక, సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. తిరుచానూరు ఆస్థాన మండపంలో ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మంగళధ్వని, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థ పండితుల చతుర్వే పారాయణం, చక్రవర్తి రాఘవన్ ధార్మికోపన్యాసం, భువనేశ్వరి బృందం ఆలపించిన భక్తి సంగీతం భక్తులను మైమరిపించింది. రాత్రి వరలక్ష్మి, సుశీల బృందం, ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకుడు శబరి గిరీష్ బృందం ఆలపించిన భక్తి సంకీర్తనలు భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. అలాగే మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య కళామందిరంలో తిరుపూర్‌కు చెందిన నరసింహారావు బృందం, కుమారి హారతి, మధుసూదన్‌రావు బృందం, శ్రీరామచంద్ర పుష్కరిణి వేదికపై సాయంత్రం కొండలరావు బృందం సంగీత కచ్చేరి ఆకట్టుకుంది. ఇక, తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాయంత్రం షఫీ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన మంత్రముగ్ధుల్ని చేసింది.

ఆకట్టుకున్న కళా బృందాల ప్రదర్శన



వాహన సేవ ముందు ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈవో, జేఈఓ తదితరులు

చంద్రగిరి: తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం ఉదయం పెద్ద శేష వాహనం, రాత్రి హంస వాహనం సేవలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల కళాబృందాలు అద్భుత ప్రదర్శనలిచ్చాయి. తమిళనాడు దిండిగల్‌కు చెందిన 25 మంది కళాకారులు దిండిగల్ డ్రమ్స్‌ను లయబద్ధంగా వాయించి ఆకట్టుకున్నారు. చెన్నైకి చెందిన సత్యప్రియ బృందం భరత నాట్యం, కేరళకు చెందిన 30 మంది మహిళా కళాకారులు మోహినీ అట్టం నృత్యాన్ని ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన 22 మంది మహిళలు వివిధ దేవతామూర్తుల వేషధారణలో అలరించారు. విశాఖపట్టణానికి చెందిన 32 మంది చిన్నారులు, యువతులు మహిషాసుర మర్దిని నృత్య రూపకం, అమలాపురం శ్రీ అయోధ్య సీతా రామ కోలాట భజన మండలికి చెందిన 28 మంది మహిళలు కోలాటం ఆకట్టుకుంది. హైదరాబాద్ రఘు రమ్య అకాడమీకి చెందిన 28 మంది కళాకారుల శ్రీనివాస కల్యాణం, కేరళకు చెందిన కళాకారుల నవదుర్గల వేషధారణ భక్తులను పరవశింపజేసింది.

అమ్మవారికి టీటీడీ మహిళా ఉద్యోగుల సారె



సారెతో వస్తున్న టీటీడీ ఉద్యోగినులు

తిరుచానూరు పద్మావతి అమ్మవారికి శుక్రవారం టీటీడీ ఉద్యోగినులు సారె సమర్పించారు. ఆలయ సమీపంలోని అలంకరణ మండపం నుంచి సారె ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పట్టువస్త్రాలు, సారెను సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో గౌతమి, బి.హేమలత, ఉన్నతాధికారుల సతీమణులు, టీటీడీ మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెద్దశేష వాహన సేవలో ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం ఉదయం పెద్దశేష వాహన సేవ నిర్వహించారు. ఈ క్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు మూడు ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించారు. వాటిలో ఎర్రాప్రగడ రామకృష్ణ రచించిన కావ్య ప్రబంధాల్లో ఆధ్యాత్మిక కథలు, ఆచార్య రేమిల్ల వెంకట రామకృష్ణశాస్త్రి రచించిన బేతాళ పంచవింశతి, ఆచార్య విశ్వనాథరావు రచించిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జీవిత చరిత్ర, వావిలికొలను సుబ్బారావు రచించిన ఉపదేశ త్రయం పుస్తకాలు ఉన్నాయి. కార్యక్రమంలో టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి ఆకెళ్ల విభీషణ శర్మ, ఉపసంపాదకులు నరసింహాచార్య తదితరులు పాల్గొన్నారు.





పెద్దశేషుని పడగలో అమ్మవారితో కొలువైన శ్రీవారి ముందు, వాహన సేవ ముందు నృత్యం చేస్తున్న కళాకారులు